క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి స్వామివారికి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

అనధికారిక మద్యం విక్రయాలపై దాడులు

కోవూరు : మండలంలోని లేగుంటపాడులో అనధికారిక మద్యం విక్రయాలపై ఎస్సై రంగనాథ్‌గౌడ్ గురువారం దాడులు నిర్వహించారు. చిత్తూరు జిల్లా సీతంపేటకు చెందిన గౌస్‌బాషా లేగుంటపాడులో ఉంటూ మద్యం విక్రయిస్తున్నాడు. ఈ మేరకు అతన్ని అదుపులోకి తీసుకుని పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

సీఐఎఫ్ఏ తీర్మానాల ఆమోదానికి వినతి

నెల్లూరు(దర్గామిట్ట): వ్యవసాయ రంగ బలోపేతానికి గానూ కన్సార్షియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ (సీఐఎఫ్ఏ) తీర్మానాలను రాష్ట్రపతి ఆమోదించాలని ఏపీ రైతు సంఘ అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్రపతికి రాసిన లేఖను కలెక్టరేట్లో ఏఓ మధుసూదనశర్మకు గురువారం అందజేశారు. ఏవీఆర్ నాయుడు, మాలకొండారెడ్డి, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం రేపు

నెల్లూరు (టౌన్): వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించనున్నామని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని కెనరా బ్యాంక్ సహకారంతో గురువారం నిర్వహించారు. ఆర్థిక అవగాహనకు రిజర్వ్ బ్యాంక్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఆర్‌బీఐ రూపొందించిన క్రాస్ పజిల్ ఆధారిత పరీక్షను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.నాలుగు వేలు, రూ.మూడు వేలు, రూ.రెండు వేలను అందజేశారు. లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ప్రదీప్‌కుమార్, నాబార్డు మేనేజర్లు రవిసింగ్, సాయికిరణ్, ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు చెంచురామయ్య, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివలీలా తరంగిణి సప్తాహం

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రిని పురస్కరించుకొని శివలీలా తరంగిణి సప్తాహాన్ని శుక్రవారం నుంచి ఈ నెల ఏడు వరకు నిర్వహించనున్నామని పద్యసారస్వత పరిషత్ సంస్థ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి మందిరం, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో రోజూ సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలి రావాలని కోరారు.

తూ.కొ. అధికారుల దాడులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు దుకాణాలపై ఆకస్మిక దాడులను తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ఆ శాఖ కంట్రోలర్ ఆదేశాల మేరకు ఒంగోలు, బాపట్ల, నెల్లూరు అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలను నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పలు బియ్యం దుకాణాలతో పాటు కూల్‌డ్రింక్స్, ఐరన్ షాపులపై దాడులు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. నికర తూకం కన్నా తక్కువగా బియ్యం బస్తాలను విక్రయిస్తున్న వారిపై ఏడు.. ఆత్మకూరు బస్టాండ్‌లో అధిక ధరలకు కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్న వారిపై ఆరు.. ఐరన్ షాపుల్లో మోసాలకు పాల్పడిన వారిపై మూడు.. ఇతరత్రా రెండు కేసులను నమోదు చేశారు. డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్, అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిధిలో చిన్న.. ప్రగతిలో మిన్న

మండలంలోని పిడూరు గ్రామం కేవలం 2,300 మంది జనాభా కలిగిన చిన్న పల్లెటూరు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఈ గ్రామం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రగతి బాట పట్టింది. ఊర్లో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు కావడంతో పాటు మౌలిక వసతులు సమకూరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- అతిచిన్న గ్రామంలో అభివృద్ధి పరవళ్లు
- మారిన పిడూరు రూపురేఖలు



సుందరంగా తీర్చిదిద్దిన ప్రాథమిక పాఠశాల



దళితవాడలో నిర్మించిన రామాలయం

మనుబోలు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఊరూరా సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు, సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణమయ్యాయి. నవరత్నాల పేరుతో వివిధ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. రాజకీయ ప్రమేయం, వివక్షకు తావు లేకుండా వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా సంక్షేమాన్ని అమలు చేస్తుండడంతో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గ్రామాల్లో పర్యటించి క్షేత్ర స్థాయిలో సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి బాటలు వేశారు.

గ్రామ పరిధిలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పిడూరు గ్రామంలోనే రూ.13.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయి. ప్రతి వీధిలో సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు, సచివాలయ భవనం, ఆధునిక వసతులతో శ్మశానవాటిక నిర్మాణం, చెరువుల అభివృద్ధి, గ్రావెల్ రోడ్లు, నాడు-నేడు ద్వారా పాఠశాల, అంగన్‌వాడీ భవనాల ఆధునికీకరణ, ప్రహరీలు, జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి వసతి తదితర పనులకు రూ.8,44,19,000 వెచ్చించారు. అలాగే జగనన్న కాలనీలో పేదలకు ఇళ్ల స్థలాలు, విద్యా దీవెన, జగనన్న తోడు, గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కంటి వెలుగు, ఇంటింటికీ రేషన్‌కు రూ.5 కోట్ల 6 లక్షల 36 వేల 646 ఖర్చు చేశారు. దళితవాడలో రామాలయం కావాలని స్థానికులు కోరగా టీటీడీ ద్వారా రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీనితో పాటు మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి గ్రామస్తుల ద్వారా చందాలు పోగేసి దళితవాడల్లో ఎక్కడా లేని విధంగా రామాలయం నిర్మాణం చేశారు.

పిడూరు సచివాలయ పరిధిలో..

డీబీటీ ద్వారా నగదు చెల్లింపులు	రూ.9,47,06,339
వివిధ అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు	రూ.13,50,55,646



నూతనంగా నిర్మించిన శ్మశానవాటిక

మిక్స్‌డ్ కాలనీలో సిమెంటు రోడ్డు



పిడూరు గ్రామ సచివాలయం

జగనన్న రుణం తీర్చుకోలేం



మా కుటుంబంలో అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న ఆసరా, చేదోడు పథకాల ద్వారా నగదు జమ అయింది. ఇంటి స్థలం ఇచ్చారు. మా అత్తకు ప్రతినెలా రూ.3 వేల పెన్షన్ వస్తోంది. ఇన్ని పథకాలతో పేదలను ఆదుకున్న ప్రభుత్వాలను గతంలో ఎప్పుడూ చూడలేదు. సీఎం జగనన్న రుణం తీర్చుకోలేం.

– సుళ్లూరు మానస, గృహిణి, పిడూరు

మా ప్రాంతం బాగుపడింది



జగనన్న ప్రభుత్వం వచ్చాక మా ప్రాంతం అన్ని రకాలుగా బాగుపడింది. మాకు ఆర్థికంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా నెలకు రూ.3 వేల పింఛన్ ఇస్తున్నారు. గతంలో ఇక్కడి రోడ్లు అధ్వానంగా ఉండేవి. ప్రస్తుతం సిమెంటు రోడ్లు వేశారు. ప్రభుత్వ పాఠశాలను కూడా బాగు చేశారు. మా దళితవాడలో రామాలయం కావాలంటే అన్ని హంగులతో పెద్ద ఆలయం నిర్మించారు. ఇంత మేలు చేసిన ప్రభుత్వాన్ని మరిచిపోం.

– బల్లోలు పెద్దక్క, మిక్స్‌డ్ కాలనీ, పిడూరు

రుణపడి ఉంటాం



గడిచిన 57 నెలల కాలంలో జరిగినంత అభివృద్ధి ఇప్పటి వరకు జరగలేదు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతోనే గ్రామాన్ని ఇంత బాగా అభివృద్ధి చేసుకోగలిగాం. మా గ్రామాభివృద్ధికి సహకరించిన మంత్రికి రుణపడి ఉంటాం.

– మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, పిడూరు

అందరి సహకారంతో అభివృద్ధి



పిడూరు గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో అవసరమైన అన్ని పనులు పూర్తయ్యాయి. కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా మాజీ సర్పంచ్ సాయిమోహన్‌రెడ్డి, ఇతర గ్రామ పెద్దలు నిధులు పోగు చేసి శ్మశానవాటిక, దేవాలయాల నిర్మాణానికి సహకరించారు.

– కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి

నేడు పొదలకూరుకు మంత్రి కాకాణి రాక

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పొదలకూరులోని కాకాణి నగర్లో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, మెయిన్‌రోడ్డులో కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తారని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ గురువారం తెలిపారు. మండల స్థాయి అధికారులంతా పాల్గొనాల్సిందిగా సూచించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని ఎంఎం ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఉదయం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు మల్లారెడ్డి, సతీష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

పొదలకూరు : పట్టణ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూల చంద్రశేఖర్ ప్రచారంలో పాల్గొని, మాట్లాడారు. ప్రత్యేక హోదా, రుణమాఫీ, ప్రతిసంవత్సరం జాబ్ క్యాలెండర్ తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు విజయబాబు, మస్తాన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పెంచలయ్య పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



కోవూరు : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కోవూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవీఎం డెమానిస్ట్రేషన్ ప్రత్యేకాధికారి, ఎంఈఓ అంకయ్య మాట్లాడుతూ ప్రతి ఓటరు ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎలా ఓటు వేయాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ టి.వెంకటరత్నం, అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు అభినందనీయం



విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న సర్పంచ్

ముత్తుకూరు : మండలంలోని తాళ్లపూడి గ్రామంలో వారం రోజుల పాటు మత్స్యకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలు అభినందనీయమని సర్పంచ్ మెట్టా వింధ్యరెడ్డి కొనియాడారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం చివరి రోజు సందర్భంగా గురువారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. మత్స్యకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ ధనపాల్, విస్తరణాధికారి డాక్టర్ మాధవన్, ఉపసర్పంచ్ గోపాల్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు త్రివేణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి



మాట్లాడుతున్న ఈఆర్వో శ్రీనివాసులు

కోవూరు : ఎన్నికల విధులు నిర్వహించే సెక్టోరియల్ అధికారులు వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోవూరు నియోజకవర్గ ఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికలకు సంబంధించిన పలు విషయాలపై సెక్టోరియల్ అధికారులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమ నిబంధనలకు తగినట్లు మౌలిక సదుపాయాలు ఉన్నాయా.. అనేది తెలుసుకోవాలన్నారు. ఈ మేరకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌లు మధుసూదన్‌రావు, రవికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ సాగునీరు

- ఇరిగేషన్ డీఈ గురజాల



రైతులతో కలిసి చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

మనుబోలు : ఈ ఏడాది చిట్టచివరి ఆయకట్టు రైతులకు కూడా సాగునీరు అందించామని ఇరిగేషన్ డీఈ గురజాల అన్నారు. మండలంలోని జట్లకొండూరు పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులను ఆయన గురువారం పరిశీలించారు. కనుపూరు కాలువ ఆయకట్టు పరిధిలోని నిడిగుంట, కోనేటమ్మ, కొండూరమ్మ, పెట్లగుంట, పాకాల, కుడితిపల్లి చెరువుల ద్వారా సాగునీరు అందుతున్న వైనం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం మాట్లాడుతూ మంత్రి కాకాణి చొరవతో తమ గ్రామ పంచాయతీ పరిధిలో పొలాలన్నింటికీ ఈ ఏడాది సమృద్ధిగా సాగునీరు అందుతోందన్నారు. రైతుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. వారి వెంట ఇరిగేషన్ ఏఈ వెంకటరమణయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు రమేష్, జగదీష్, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, సురేష్, కిరణ్, నాగరాజు, మోహన్ తదితరులు ఉన్నారు.

కౌన్సిల్‌లో పలు అంశాలు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమావేశంలో వివిధ పనులకు సంబంధించి 22 అంశాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అన్ని అంశాలను కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారని వివరించారు. సమావేశంలో కమిషనర్ రమణబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంద ఆలయాల నిర్మాణానికి కృషి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి కాకాణి

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలో వంద ఆలయాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పూడిపర్తి గ్రామంలో దేవదాయశాఖ నిధులు రూ.50 లక్షలతో శ్రీసీతారామాంజనేయులు స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో మంత్రి కాకాణి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చేసినట్లు తెలిపారు. అలాగే అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని తెలియజేశారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటుగా ఆధ్యాత్మికతను కూడా మేళవించేందుకు ప్రజల ఆకాంక్షల మేరకు పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలకు ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం తీసుకుంటున్నట్లు వివరించారు. పూడిపర్తిలో సీతారామాంజనేయ స్వామి దేవాలయం పూర్తిగా దెబ్బతిందని, పునర్నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు వెంటనే నిధులు సమకూర్చి, భూమి పూజ, ప్రాణ ప్రతిష్ట చేశారని పేర్కొన్నారు. పేదలు ఉండే కాలనీల్లో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలు వెచ్చించి ఆలయాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, డక్కిలి రమణయ్య, ఎంపీటీసీలు కోడూరు రఘునాథరెడ్డి, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, సర్పంచ్ డక్కిలి శ్రావణి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కారూరు శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు కోడూరు శ్రీధర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మరళీధర్‌రావు పాల్గొన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



రామకృష్ణ

పొదలకూరు : పొదలకూరు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా డి.రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంటూరు జిల్లా రేపల్లె నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పనిచేస్తానన్నారు. కాలేజీల వద్ద ఈవ్‌టీజింగ్ జరుగుతుంటే తన దృష్టికి తీసుకురావాల్సిందిగా సూచించారు.

జిల్లాలో టీబీ తగ్గుముఖం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

కోవూరు : గతంతో పోలిస్తే జిల్లాలో క్షయ(టీబీ) రేటు క్రమంగా తగ్గుముఖం పట్టిందని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ, జిల్లా లెప్రసీ-టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపాళెం పంచాయతీలో పలు ప్రాంతాలను ఆయన గురువారం పరిశీలించారు. గతంలో టీబీ సోకి ప్రస్తుతం నయమైన వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 36 గ్రామాలను పూర్తిగా టీబీ నయమైన గ్రామాలుగా గుర్తించినట్లు వివరించారు. అయినప్పటికీ ఆయా గ్రామాలను ఒకటికి రెండు పర్యాయాలు నిశితంగా పరిశీలించడమే కాకుండా గతంలో టీబీ సోకి ప్రస్తుతం పూర్తిగా నయమైనవారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నామన్నారు. కోవూరు మండలంలో పోతిరెడ్డిపాళెం, లేగుంటపాడు, మోడేగుంటలను క్షయ రహిత గ్రామాలుగా గుర్తించినట్లు తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తులకు బలవర్ధకమైన పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదలకూరులో రెండు పరీక్ష కేంద్రాలు

పొదలకూరు : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కాకతీయ జూనియర్ ప్రైవేటు కాలేజీలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కాలేజీలో 263 మంది, ప్రైవేటు కాలేజీలో 191 విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. విద్యార్థుల సంఖ్యకు అనువుగా బెంచీలను ఏర్పాటు చేసి గాలి, లైటింగ్ తగిలే విధంగా కిటికీలు ఉండేలా రూమ్‌లను ఎంపిక చేశారు. పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు వెల్లడించారు.

ఘన సన్మానం

నెల్లూరు(పొగతోట): జెడ్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులురెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సభలో ఆయన్ను సత్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈఓ కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.